# గాలికోళ్ళు

ఆ ఊరి జిల్లా ముఖ్యపట్టణం కాదు. కాని ఆ జిల్లాలో అతిముఖ్యమైన పట్టణం. ఆ జిల్లాలోనే కాదు ఆ రాష్ట్రంలోనే ముఖ్యమైన పట్టణం. పెద్ద రైల్వే జంక్షనూ, సిమెంటు ఫ్యాక్టరీలూ, మరెన్నో పరిశ్రమలూ, కావలసినన్ని సినిమాహాల్సూ, కావలసినవారికి దేవాలయాలూను ప్రక్కనే పురవళ్ళతోనూ పరవళ్ళతోనూ పారే జీవనది కొండమలుపు దగ్గర, ఆనకట్ట కెగువగా నదిలో పడవలూ, లాంచీలూ, వాటి కెగువగా లంకలూ, చెట్లూ. అంతటితో చాలదని వో రెగ్యులేటరు రోడ్డుబ్రిడ్జి! దానికటూయిటూ మెరిసిపోయే పాలరంగు గాజు గ్లోబుల వరుసా వీటన్నిటినీ మరిపిస్తూ ఆ వస్తునో గాలికోడీ, యీ వస్తునో గాలికోడీ ఇక చెప్పవలసిందేముందా రామణీయకాన్ని గురించి?

ఎండాకాలంలో వడగాడ్పు కొట్ట కొట్టి కాస్త తగింది. అంతవరకూ పడమటవైపు చూస్తూ కాలంగడిపిన గాలికోళ్లు గిర్రున దక్షిణానికి తిరిగాయి. కొండమీద ఇంట్లో కాపురముంటున్న వాళ్ళబ్బాయి, కొండ 'ముకిరి' మీదికెక్కి ప్రకృతిరామణీయకాన్ని ముగ్ధుడై చూస్తున్నాడు. అస్తమిస్తున్న సూర్యుడూ, లంకలూ, రోడ్డూ, అవతలివొడ్డున వూరూ, రెగ్యులేటర్ రోడ్ బ్రిడ్జి, రోడ్డుపైని విద్యుద్దీపాల బుడ్లూ, అవతలి రైలుబ్రిడ్జీ, వంతెనక్రింద యిసుకా, పాయలై పారే నీళ్ళూ, రకరకాల రంగుల్లో మనుష్యులూ, రోడ్డుబ్రిడ్జిపైని తెరిపి లేకుండా తిరిగే కార్లూ బండ్లూ మనుష్యులూ, తళతళలాడే గాలికోళ్ళూ, అత్యంత సుందరంగా వుందా దృశ్యం. ఇదంతా చూస్తూ, గాలితో పాటే పందెం వేసినట్టుగా తిరుగుతుండే గాలికోళ్ళను ప్రత్యేకంగా చూడ్డ మతనికి సరదా.

* * *

వ్యాసారావు యం. ఏ. అభ్యుదయవాది పురోగాముల జాబితాలో వోకడు అలాగని అభ్యుదయ కవిత్వంలాటిది వ్రాస్తాడనుకుంటారేమో, ముచ్చుకైనా చేతగాదు. పేరు వ్యాసారావేగాని వ్యాసాలు వ్రాయటమైనా రాదు. అయితే మంచి చురుకైన యువకుడూ, సంస్కరణాభిలాషీ. విద్యార్థిగా మంచి వుపన్యాసకుడని పేరు తెచ్చుకున్నాడు కళాశాలల్లో. స్త్రీల సమస్యలపైన అతనికి స్పష్టమైన భావాలున్నయ్. ఆ సమస్యల్ని పరిష్కరించేందుకు తీక్ష్ణమైన అభిప్రాయాలూ వున్నయ్. అసలు స్త్రీలసమస్యల్ని పరిష్కరించి, స్త్రీని సుశిక్షితురాలుగా చేస్తే భారత సమస్యలన్నీ వాటంతటవి ఏ పంచవర్ష ప్రణాళికలూ అవసరం లేకుండానే సర్దుకుంటాయనే వ్యాసారావు విశ్వాసం. కాని స్త్రీ సమస్యల ప్రసక్తి యెక్కడ తీసికొనివచ్చినా, అంతా నిర్లక్ష్యంగా పెదవి విరవటం చూచి నిర్లిప్తుడై పోయేవాడు. విద్యాధికులైన స్త్రీలు సైతం, "జీవితంలో యెన్నో సరిపడని సందర్భాలు వస్తాయి. మనం వూహించే వుపన్యసించే సమస్యలకన్నా విపరీతమైన

"చైతన్య"

సమస్యలూ, సర్దలేని సంఘటనలూ యెన్నో వుత్పన్నంగావచ్చు" నన్నపుడు నిస్పృహతో వుస్సురనుకొనేవాడు చివరకతనికి మిగిలిందొక్కటే ఆశ; తనజీవితంలో తన అభిప్రాయాలనన్నిటినీ ఆచరణలో పెట్టి తన ఊహాలు ఆచరణ యోగ్యాలని ఋజువు చేయాలన్నది.

అందుకు మొదటిప్రయత్నంగా తను స్వయంగా, తలిదండ్రులకు కొద్దిగా వ్యతిరేకంగానే, బి. ఏ దాకా చదువుకొన్న సరళను, కానీ కట్నం పుచ్చుకోకుండా, ఐదు వేలూ; పదివేలూ యిస్తామని వస్తున్నా, తనకూ ఆట్టే ఆస్తిపాస్తులు లేకున్నా, వివాహమాడాడు. సరళ హృదయం కృతజ్ఞతతో నిండిపోయింది.

సరళ వ్యాసారావులాగానే చురుకైన మనిషి. చాలా సరళమైన స్వభావంకలది మితభాషిణి అనుకున్నదేదో నెరవేర్చేదాకా నిద్రించలేని వ్యక్తి. అందమైన విగ్రహం; అణకువా, నిరాడంబరతా యినుమడింపజేస్తుంటాయా అందాన్ని. సరళదృష్టిలో వ్యాసారావు సామాన్యమైన భర్తకాదు. తన నుద్ధరించిన మహాపురుషుడు. త్యాగమూర్తి. ప్రథమ సమాగమంలో ఆ ప్రేమైకమూర్తి చిలికించిన ప్రేమా, వెల్లడించిన ఆదర్శాలూ, చూపిన ఆదరణా, ఆమె జీవితాంతం విస్మరింపలేదు. అంత మహోన్నతభావాలుగల వ్యక్తి తనకు భర్తనుకున్నప్పుడు పొంగిపోయిందామె హృదయం. అక్షరాలా అడుగులకు మడుగులొత్తే భార్య అయింది సరళ.

వ్యాసారావు ఎం. ఏ వుద్యోగంకోసం అంత బాధపడకుండానే కాలేజీలో లెక్చరరుగా వుద్యోగం కుదిరింది. గాంధీనగరంలో కాపురం పెట్టాడు. ఇన్నాళ్ళటి వ్యాసారావు కాదిప్పుడు కొత్త కుటుంబభారం నెత్తిన పడ్డవాడయ్యాడు. తనకు వచ్చే జీతంలో నెలకు 75 రూపాయలు గుంటూరులో వున్న తలిదండ్రులకు పంపకపోతే బండి దొర్లదు గుంటూర్లో. మిగిలిన నూటపాతికలోనే కాలేజీ లెక్చరరుకు కావలసిన డ్రెస్సును పోషించుకుంటూ, హోదాకుతగిన ఇంటికిచ్చుకుంటూ, వచ్చేపోయే స్నేహితుల కాఫీకి ఖర్చుపెడుతూ, యిదరిపాట్లా గడుపుకోవటమే కష్టమైపోతోంది. ఇంకా సరళ మెళుకువగా సర్దుకుపోతున్నది గాబట్టి లేదనకుండా కాపురమూ కాలమూ దొర్లుకుపోతున్నవి ఈ క్రొత్తజీవితమూ సుధామయంగానే గడచిపోతోంది వాళ్ళిద్దరికీ. ఇక సరళపడే బాధల్లా వ్యాసారావు రోజూ పట్టుకొచ్చే ప్రతివాడికి వోనవ్వు విసరి, వోనమస్కారం పారేసి, కాఫీని స్వయంగా అందివ్వటం దగ్గరనే. వ్యాసారావు తృప్తి కోసమే ప్రాణం బిగబట్టుకొని యీ కాస్తా చేయటం ఆమెకి తప్పటం లేదు. తన అందాలభార్యని స్నేహితులందరికీ పరిచయం జేసి, ఆమెచేత స్వయంగా కాఫీనిప్పించి, యేదో అభ్యుదయాన్ని సాధించినట్లే తృప్తిపడేవాడు వ్యాసారావు. అయినా తనతో పాటుగా క్లబ్బుకు రాదని, యెంతచెప్పినా స్వాతంత్ర్యాన్ని పుచ్చుకోదనీ వ్యాసారావుకు వోమూల సరళనుగురించి బాధగానే వుంది. ప్రక్కయింటివాళ్ళతో పెత్తనానికి వెళ్ళటానికి కూడా తనతో చెప్పి పర్మిషను పుచ్చుకోవాలా? అని కసురుకున్న సంఘటలున్నా ఆమె ఆపద్ధతిని

# ★ గాలికోళ్ళు ★

మానుకోలేదనే విచారంతో గ్రహచారం లెమ్మని క్రొపు సవరించుకునే వాడు పాపం వ్యాసారావు. అయినా స్త్రీకి స్వాతంత్ర్యం ఇచ్చివేయటమే తన లక్ష్యం గాబట్టి యీ విషయాల్లో యింతకన్నా పట్టుదల చూపించలేక వూరుకున్నాడు.

## 2

ఆరోజు మాలంకర్‌జీ నిర్యాణాన్ని పురస్కరించుకొని కాలేజీ మూసివేశారు. ముందుగా యీ విషయం తెలియక కాలేజీకి వెళ్లిన ఆచార్యవర్గమూ, విద్యార్థి సమూహమూ విచారంతో కొంతమంది, వుత్సాహం(సెలవు వచ్చిందని)తో కొంతమందీ యింటిముఖం పట్టారు. మాలంకర్‌జీ వంటి సమర్థుడూ, ఆదర్శమూర్తీ మరణించినందుకు విచారపడుతూ యింటికిచేరిన వ్యాసారావు యిల్లు తాళంవేయబడివుండటం చూసేసరికి ఆశ్చర్యపోయాడు. సరళ చివరకు స్వతంత్ర భావాల నలవర్చుకుని ఆచరణలో పెట్టుతున్నదని గ్రహించి కొండెక్కినంతయింది వ్యాసారావుకు. తక్షణమే ఆమె నభినందించడంకోసం, ఆమె ఆరోగ్యంకోసం, తన సంతోషాన్ని తనివిదీరా జీర్ణంచేసికోవటంకోసం ప్రయాణమయ్యాడు కాఫీ హోటలుకు. ఇంతలో ప్రక్కవాటాలోని బామ్మగారు ప్రత్యక్షమైంది ముసుగు సవరించుకుంటూ. సరళ ఎంతదూరం వెళ్లిందోకూడా తెలుసుకుంటే, యెంత సాహసి అయిందో అంచనా గట్టవచ్చని, ఆ అంచనాతో తన సంతోషాన్ని ద్విగుణీకృతమో, త్రిగుణీకృతమో చేసికొని/ మరీ కాఫీత్రాగాలో, టీ త్రాగాలో, వోవల్‌టైన్ త్రాగాలో నిర్ణయించుకోవాలనీ ఆశించిన వ్యాసారావు వెంటనే బామ్మగారి నడిగాడు, "సరళ యెక్కడికి వెళ్ళిందండీ?" అని. "ఎక్కడికో వెళ్తుంది నాయనా యెవరితోనో; నాలుఘంటలికగాని రాదు. పైవిషయాలు నేనెరగను పెద్దముండ"నంది ఆపూర్వసువాసిని "రైటో!" అని లోపలే అనుకొని యెకబిగిన 'రామకృష్ణా' లో వోవల్‌టైన్ ఆర్డరుచేసి ఆలోచనలోపడ్డా డకస్మాత్తుగా వ్యాసారావు. అతనికి బామ్మగారి మాటలేవో విపరీతంగా కన్పించినయ్. ఓవల్‌టైన్ చప్పరిస్తూ "సరళ రోజూ వెళ్తుందా? నాలుగ్గంటలకిగానిరాదా? ఎవరితోనో వెళ్తుందా? . ఎవరితో వెళ్తుంది? ఎక్కడికి వెళ్తుంది? ఎందుకు వెళ్తుంది? తను సర్వస్వతంత్రంయిచ్చేమనిషే గదా, యీవెళ్ళే వ్యవహారాన్ని యెందుకింత గూఢంగా వుంచాలి?" అని వొకేవొక ఆలోచనలో పడిపోయాడు ఎన్నివిధాల సమాధానపరచుకోవాలన్నా కుదరటంలేదు. అసలు సంగతేమిటో తనుగా సరళ నడగకుండా, వీలైతే వోపెద్ద డిటెక్టివులాగా గ్రహించివేయాలనీ, రహస్యంగా కనిపెట్టాలనీ తీర్మానించుకున్నాడు అంత ఆధునిక భావాలున్న వ్యాసారావు యిలా జారిపోయాడని యెలా నమ్మలోకూడా వూహించుకోలేం; నిప్పులు చెరుగుతూ కాసినయెండ నిముషంలోపోయి, వర్షం కుండపోతగా కురవటం ప్రకృతిసహజమేనని జ్ఞప్తికి వస్తే తప్ప!

యథాప్రకారంగా అయిదింటికి యింటికి చేరుకున్నాడు వ్యాసారావు. అలవాటు ప్రకారం హాస్యన్ను పుచ్చుకొని ఆహ్వానించింది సరళ చిరునవ్వుల్ని చిలకరిస్తూ. తనూ యెప్పటిలాగే "గుడ్ యీవెనింగ్ డియర్!" అంటూనే పుచ్చుకున్నాడాపానీయాన్ని. అంతా యెప్పటిలాగే జరిగిపోయిం దప్పటికి. భోజనాలై పడకలమీదకు చేరాక సరళను సంగతులడిగాడు వ్యాసారావు. ఏ సందర్భంలోనైనా, తాను మధ్యాహ్నం యెక్కడికి వెళ్లిందో చెప్తుందేమోనని. ఎన్నిసంగతులో చెప్పినసరళ ఆసంగతిని గురించే ప్రస్తావించలేదు. అందుకే వుడికిపోతున్న వ్యాసారావును సరళ, సత్యనారాయణపురంలోవున్న బంధువుల్ని మర్నాడు చూచివద్దామని వుంది వెళ్లిరమ్మంటారా?" అని అడగటం నిలువునా దహించివేసింది. ఐనా తమాయించుకొని "యో ఎస్" అని అన్నాడుగాని, తనను సరళ పట్టపగలు గుడ్డివాణ్ణిగా చేసి మోసం చేస్తోందని భావించుకున్నాడు. మేరీకొరెల్లీ వ్రాసిన 'విస్మరింపబడిన వ్యక్తికథ'(A Story of One Forgotten) స్మృతిపథంలో మెరిసింది. అతని హృదయం కలుషితమై కలతపడ మొదలుపెట్టింది. సరళను సూటిగా ప్రశ్నించే ధైర్యంకూడా లేకపోగా వుక్రోషాన్ని తీర్చుకునేందుకే దోవాతోచక, నిద్రాపట్టక, విసుగ్గావుందని విసురుగా డాబామీదకు వెళ్లాడు వ్యాసారావు. గాలికోళ్ళనుచూస్తూ యెన్నిగంటలు గడిపాడో, గదిలో నిద్రపోయిన సరళకు తెలియనే తెలియదు. తెల్లవారి కాఫీకూడా త్రాగకుండానే సైకిలుతీసిన వ్యాసారావు ధోరణి సరళకు వింతగానే కనిపించింది. "ఎక్కడిదాకా ప్రయాణం" అని ఛలోక్తిగా మాటాడిన సరళవంక, ముఖం ముందులాపెట్టుకొని వ్యాసారావు చూచినచూపు ఆమెకెంతో బాధాకరంగా తోచింది. అతనిలో ఈవింత మార్పెందుకు వచ్చిందో గ్రహించలేక సరళ చిన్నబోయింది. ఎంత ఆలోచించినా ఏ కారణమూ కన్పించనేలేదామెకు. ప్రక్కవీథిలోని లెక్చరరుగారబ్బాయి, వాళ్ల నాన్నగారు క్రితంరోజు వ్యాసారావుదగ్గర తీసికొన్న కలాన్నివ్వటానికి వచ్చి, మాటల ధోరణిలో మాలంకర్‌జీ నిర్యాణాన్ని గురించి, కాలేజీ మూసివేయటం, అంతా పన్నెండుగంటలకే రావటం చెప్పాడు. అతనలా వెళ్లగానే బామ్మగారి నడిగింది సరళ, "ఆయన నిన్న మధ్యాహ్నం వచ్చారటండీ?" అని. "వచ్చినట్లున్నారమ్మ, 'ఎక్కడికి వెళ్ళింది, ఎక్కడి కెళ్ళిందని గుచ్చి గుచ్చడిగితే నాకే సిగ్గయింది," అని సమాధానం చెప్పిందా బామ్మగారు తడిగుడ్డ పిండుకుంటూ. దుఃఖం ముంచుకొచ్చిన సరళ వ్యాసారావును రాగానే అడిగివేసెయ్యాలని తలపోసింది. ఇంకా వ్యాసారావురాలేదేఅనితహతహలాడిపోయింది తనసంత అనుమానంగా భావించినందు కవమానపడిపోయింది. వ్యాసారావు




గుండె దగ్గు శమనమునకు పెప్సును సేవించుడు

దగ్గులు, జలుబులు, గొంతు నొప్పులు, రొమ్ము పడిసెములు, ఇన్‌ఫ్లుయంజ ప్రమాదకరములు, పెప్సుతో ఘనీభవ కఫమును తొలగించివేయుడు పెప్సులోని శమనకర ఔషధ సారములు, త్వరగా దగ్గులను ఆపును, మంటతో గూడిన వాపును రహితమొనర్చును, ప్రమాదకర క్రిములను చంపును ఊపిరి తిత్తులను గొంతును శమనపర్చును. డాక్టర్లు పెప్సును శిఫారసు చేసియున్నారు. పిన్నలు పెద్దలు కూడ సేవించవచ్చును, ఇందు హానికర ఓషధులు లేవు.



PEPS
పెప్స్
గొంతు మరియు గుండెల అంటువిరోధక బిళ్లలు. FPY-42-TEL

సోల్ ఏజెంట్లు దాదా & కో.
86, సైనప్పనాయక్ వీధి, మద్రాసు -8

రావటం మాలస్యం కావటంవల్ల కొంచెం స్తిమితం చిక్కి జాగ్రత్తగా ఆలోచించ సాగింది. ఆఖరి కతన్ని తానుగా యేమీ హెచ్చరించకూడదనీ అతనే ప్రస్తావన తెస్తేనే సమాధానమిద్దామనీ భావించింది. కనీసం లీలగానైనా తనలో ఖేదాన్నిగానీ, కోపాన్నిగాని కనపడనీయకుండా, యెప్పటి చలాకీ సరళగానే మసలుకోసాగింది వ్యాసారావు తిరిగి యింటికి చేరేపాటికి.

తరువాత కొన్నాళ్ళు వ్యాసారావు అకస్మాత్తుగా యింటికి కాలేజీనుంచి వచ్చి భద్రంగా వేయబడ్డ తాళాన్ని చూచి వెళ్ళేవాడు. సరళ తను కాలేజీకి పోయిన అరగంటకు యింటికి తాళం వేసి వెళ్తుందని, తను రావటానికి అరగంట ముందుగా యింటికి చేరుతుందనీ గ్రహించగలాడు వ్యాసారావు. తను యెప్పటిలా కాలేజీకని బయలుదేరి తీరా గుమ్మంలోకి వెళ్ళి తిరిగివచ్చి కోటూ, బూటూ తీసి కాలేజీ మానివేసినరోజు, సరళ యెప్పటిలా వెళ్ళకుండా యింట్లోనే వుండిపోవటం, ముంజేతికంకణానికి అద్దమెందుకన్నంతటి నమ్మకాన్ని గల్గించింది అతని అనుమానాన్ని ధృడతరం జేసి. వ్యాసారావు అభ్యుదయవాది గాబట్టి నోరెత్తలేకపోయాడు సరళముందు. కాని స్త్రీలను గురించి అతని కున్న సదభిప్రాయాలన్నీ హారతికర్పూరంలా హరించుకుపోసాగాయి. మెల్లమెల్లగా స్త్రీలంటే పూర్వులు వ్యక్తీకరించిన అభిప్రాయాలే సబబైనవేమోననే తలపులు కూడా తలచూపసాగాయి. వీటన్నిటి ఫలితంగా సరళతో చిటపటలాడుతూనే కాలం గడుపుతున్నాడు వ్యాసారావు అవసరమొచ్చినంతవరకు ముక్తసరిగా మాట్లాడి కాలాన్ని గడిపివేయసాగింది సరళ వ్యాసారావుతో. అందరికీ ఆదర్శంగా కన్పించే ఆ సంసారంలో అగ్నిపర్వతాలు కాపురం చేస్తున్నాయని ఆ యిద్దరికే తెలుసు-ఆదర్శదంపతులకు!

## 3

కాలేజీ ఆచార్యవర్గాన్ని స్వయంగా ఆహ్వానించారు స్త్రీసమాజపు టధ్యక్షు కార్యదర్శినిలు, వార్షికోత్సవానికని ప్రధానాచార్యులు తప్పకుండా రాగలమని హామీయిచ్చారు. అధ్యాపకవర్గమంతా హాజరుగావటాని కుత్సహించారు. ఆనాటి వుత్సవానికని ప్రత్యేకంగా వేయబడ్డ పందిరి అందచందాల అలంకరణలతో రామణీయకంగా వుంది. కోలాహలంగా స్త్రీలు చీరెల ఫెళఫెళలతో సింగారాలకు శృంగారాన్నిస్తూ కార్యక్రమాన్ని జయప్రదంగా నిర్వర్తించటానికి సమధికోత్సాహంతో కాయశక్తులా కృషిచేస్తు


బాగా ఆదా! ఒకే ఒకసారి తోముకుంటే
కాల్గేట్ డెంటల్ క్రీమ్
85% వంతుల వరకు


కాల్గేట్‌కు నిదర్శనమున్నది!
ఒకే ఒకసారి తోముకుంటే
దుర్గంధాన్ని తక్షణం ఆపుతుంది!

దంతక్షయం


కాల్గేట్‌కు నిదర్శనమున్నది!
ఒకే ఒకసారి కాల్గేట్ తోముకుంటే
దంతక్షయానికి కారణమైన క్రిములను
85/ వంతులు తొలగిస్తుంది!

దుర్గంధం
కలిగించే
క్రిములను


కాల్గేట్‌కు నిదర్శనమున్నది!
రుచికి దేశంలో మన్నన పొందింది!

తొలగిస్తుంది

ఇండియాలో విశేషంగా
అమ్మకమౌతున్న టూత్‌పేస్టు!

ఎకానమీ సైజు కొనండి—
ఆదా చేసుకోండి!




కాల్గేట్ ఒక్కటె ఈ మూడింటినీ చేస్తుంది!
పండ్లను పరిశుభ్రంచేస్తూనే
దుర్గంధాన్ని నివారించి,
దంతక్షయాన్ని నిరోధిస్తుంది!

సత్ఫలితాలకు
సర్వదా వాడండి.
కాల్గేట్
టూత్
బ్రష్

న్నారు. ఆహూతు లందరినీ ఆదరపూర్వకంగా వారివారికని ప్రత్యేకింపబడ్డ స్థలాల్లో కూర్చుండజేస్తున్నారు కొందరు వుత్సాహవంతులు. జరుగవలసిన కార్యక్రమాన్ని చర్చిస్తున్నారు పెద్దలైన బాధ్యురాండ్రు. అధ్యక్షస్థానాన్నలంకరించారు ప్రఖ్యాత శ్రీమతి సుమతి. భరతమాత నారాధించారు ప్రార్థనలో 'భారతి'. ఆదర్శ మహిళామూర్తుల్నభినందించి ఆశీర్వదించండమ్మా అని అర్థించారు లలితగీతాల్లో 'లలితా ప్రభృతులు' అధ్యక్షోపన్యాసానంతరం కార్యదర్శిని నివేదికను నివేదించారు. కార్యదర్శిని నివేదిక కృతజ్ఞతను వెల్లడించింది ప్రత్యేకంగా వో ఆదర్శమూర్తికి.

"మాట్లాడటం మా మిత్రురాలికసహ్యం. చేసి చూపట మామె కాదర్శం! సరియైన కాలంలో మాతో స్వయంగా పరిచయం చేసుకుని, చేయూతనిచ్చి మా సమాజపుటునికికే కారణభూతురాలైన యీ సోదరి మాకు లభ్యం కావటం మా అదృష్టం. ఆమె మా సమాజానికి వెన్నెముకవంటిదిగావటం మాకు గర్వకారణం మా విద్యాలయానికామె నిస్స్వార్థంగా ప్రధానోపాధ్యాయినిగా పనిజేసి మా విద్యాలయానికి కీర్తిప్రతిష్ఠలు తీసికొని రావటంతో మా సమాజమే ధన్యత నందింది. ఇంత అవిరళకృషిచేసి, శ్రమించి, మార్గదర్శకురాలైన యీ ఆదర్శ గృహిణిని చంద్రునికో నూలుపోగన్నట్లుగా మా శక్తికొద్దీ సన్మానించటానికీసమాజపు కార్యవర్గం తీర్మానించి ధన్యమయింది. తరువాత కార్యక్రమాలు సమాప్తి కాగానే యీసన్మానం జరుపుతాం. ఈ సభికుల కామె పవిత్ర నామాన్ని యిప్పుడే తెలియజేయాలనే నేను వుత్సాహపడుతున్నా, ఆమెనే చూపి అందరికి పరిచయం చేయాలనీ, అంతవరకూ సందిగ్ధతలోనే మిమ్మల్నందరినీ వుంచి వొక్కమాటుగా ఆశ్చర్యచకితుల్ని చేయాలనీ మా అధ్యక్షురాలు నన్నాదేశించారు. అంతవరకూ వోపికతో దయచేసి వేచివుండండని ప్రార్థిస్తున్నా"నని కార్యదర్శిని ముగించగానే కరతాళధ్వనులు మిన్నుముట్టాయి ఉత్సాహంగా యెగురు చూడసాగారు సభికులంతా వ్యాసారావుతో సహా. ఊహాగానాలు చేయసాగారా వ్యక్తిని గురించి మరికొందరంగులో. తరువాతి కార్యక్రమం, "భామాకలాపం" ప్రదర్శింపబడ్డది. భామాకలాపం పూర్తి కాగానే "ఆమె"ను చూడ్డానికే అందరి కండ్లూ కాచుకూచున్నాయి. ఇంతలో కార్యదర్శిని మళ్ళీ మైక్రోఫోను ముంగుకు వచ్చి గంభీరంగా "ఒక్క మనవి" అనటంతో సభాంతరాళమంతా నిశ్శబ్దమైంది. కార్యదర్శిని "శ్రీ వ్యాసారావుగారు ఎం. ఏ. కాలేజీ లెక్చరర్. వీరో మారు దయచేసి యీ వేదికమీదకు రావాలని ప్రార్థన" అని ఎదురుచూడసాగింది. ఈ వ్యక్తెవరోనని అంతా వెనక్కు చూడసాగారు. కార్యదర్శిని తిరిగి శ్రీ వ్యాసారావుగారి నాహ్వానించిందా వేదిక మీదికి. వ్యాసారావు వళ్ళు ఝల్లుమన్నట్లయింది. తోటివాళ్ళంతా లెండి లెండని ప్రోత్సహించారు. యంత్రంలా వెళ్ళాడా వేదికమీదకు. నమస్కరించి ఆహ్వానించిందా కార్యదర్శిని. అలవాటు ప్రకారం కరతాళాలు మ్రోగాయాయన వేదిక నెక్కగానే. వారి నా వేదిక మీద మరో కుర్చీలో ఆసీనుల్ని చేసి కార్యదర్శిని మైక్రోఫోనుముందు నిలబడి, "సభికులకొక మనవి. ఇప్పుడే యిక్కడకు చేరిన వో జాబును చదివి వినిపించాలని మే ముత్సహిస్తున్నాం. దయతోనూ, సానుభూతితోనూ తమరంతా శ్రద్ధాళువులై శాంతంగా యీ జాబును వింటారని ఆశిస్తున్నాం," అని జాబును చదవటం మొదలుపెట్టింది వో మారు గొంతును సరిజేసికొని.

స్త్రీ సమాజం కార్యదర్శిని గారికి,

సోదరీ,

నమస్కారాలు :

మీరు నన్నభిమానంతో సన్మానించాలని నిర్ణయించి పంపిన ఆహ్వానాన్నందుకున్నాను. కృతజ్ఞురాలిని నేచేసిన సేవకన్నా మీరు నాపట్ల చూపిన ఆదరాభిమానాలు యీ మీ నిర్ణయంవల్ల వ్యక్తమౌతున్నయ్

నే నేమైనా మన సమాజాభివృద్ధికి కృషిచేసి కృతార్థురాలనై వుంటే దానికి మీరంతా నాకిచ్చిన ఆదరపూర్వక సహకారం మొదటి కారణం. రెండవది పూజ్యులు నా భర్త నాకిచ్చిన ప్రోత్సాహంకాక మరేముంటుంది?

నేను స్వయంగా యీనాటి సభకు హాజరై అందరి దీవనలతోపాటు, మీరివ్వ సంకల్పించిన బహుమతుల్ని స్వీకరించలేకపోయినందుకు క్షమించాలి. కాని మీరేమాత్రమూ యిందువల్ల నిరుత్సాహపడవద్దని ప్రార్థిస్తూ, నా కందవలసిన బహుమానాన్ని ; నాకే ఆదర్శమూర్తి ప్రోత్సాహం లభించటం వల్ల నే నీ పాటి సన్మానాని కర్హురాలను గాగలానో, ఆ నా భర్త శ్రీ వ్యాసారావుగారి ద్వారా పంపించండని ప్రార్థిస్తున్నాను. నిజానికి నేనే స్వయంగా యీ బహుమానాన్నందుకుని అనుభవించే ఆనందంకన్నా, నా తరఫున నా బహుమతుల్ని స్వీకరించి నా భర్త నాకు బహూకరించటం నాకెక్కువ ఆనందదాయకమని మీరూ వప్పుకుంటారని నమ్ముతున్నాను.

సెలవు.
సోదరి సరళ.

కరతాళధ్వనులు మళ్ళీ మిన్నంటాయి. వ్యాసారావు ఆశ్చర్యంతో వుక్కిరిబిక్కిరై, అవమానంతో క్రుంగిపోయి, పశ్చాత్తాపంతో వుడికిపోయి స్తబ్ధుడైపోయాడు. పూలదండలతన్నలంకరించసాగాయి. అభినందిస్తూ అధ్యక్షురాలు సరళకందవలసిన బహుమతుల నందించింది. వుబ్బుతున్న వ్యాసారావుకు కృతజ్ఞత ప్రకటించటంకూడా తోచలేదు. ఆగండని వ్యాసారావును వారించిన కార్యదర్శిని, "పురుషులకు మార్గదర్శి, ఆదర్శ స్త్రీమూర్తిని తీర్చిదిద్దిన మహామహుడు శ్రీ వ్యాసారావుగారిని మేం అభినందించి కృతజ్ఞత వెలిబుచ్చుకుంటూ, యీ చిన్న బహుమతిని దయతో స్వీకరించండని ప్రార్థిస్తున్నాము. చక్కని ఈ చిన్న ఫోటో ఫ్రేము సోదరి సరళ స్వయంగా గంధపుచెక్కతో మా గృహపరిశ్రమల తరగతులలో తయారు చేశారని వివరించటానికి గర్విస్తున్నా"మంటూ అందించింది వ్యాసారావును మిత్రులంతా అభినందనలలో ముంచెత్తారు. హృదయావేగాన్నణచుకుంటూ యింటికి దారితీశాడు వ్యాసారావు.

## 4

"సరళా! క్షమించు. నిన్నపార్థంచేసికున్నాను. నీకన్యాయం చేశాను. శుద్ధమూర్ఖుణ్ణయ్యాను. క్షమించానను సరళా!" నాటకంలో పాత్రధారిలా వుద్వేగంతో మాట్లాడేస్తున్నాడు వ్యాసారావు, డాబామీద వాలుకుర్చీలో పడుకొనివున్న సరళతో. "ఛీ! అదేమిటి? లెం"డని ఆప్యాయంగా తల నిమురుతూ ముఖాన్ని ముఖంలోకి త్రిప్పుకుందిసరళ. "కాదు సరళా! నిన్నర్థంచేసికోలేక..." ఏమేమో మాట్లాడబోతున్న వ్యాసారావును, ఆశ్చర్యం ప్రకటించుతూ, వ్రేలితో చూపుతూ, "అటు చూడండి! అవేమిటి?" అని ప్రశ్నించింది సరళ. అటు చూస్తూ వ్యాసారావు, "అవి తెలియదూ? రెగ్యులేటర్ రోడ్డు బ్రిడ్జిపైన గాలికోళ్ళు! గాలియెటునుంచి వీస్తుంటే అటుచూస్తుంటాయవి," అని చెప్తున్న వ్యాసారావుమాట పూర్తికాకుండానే కల్పించుకున్న సరళ, "పురుషుల మనస్సుల మాదిరేనా?" అంటూ వోనవ్వు కిలకిలానవ్వింది. ★